క్లుప్తంగా

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

ఆరిలోవ: జీవీఎంసీ పన్నెండో వార్డు పరిధి తోటగరువులో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు జన్మదినం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎర్నిదుర్గమాంబ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ భరత్, స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని, సన్యాసిరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ రక్తదాన శిబిరం ప్రారంభించారు. శిబిరంలో సుమారు 80 మంది యువకులు ఎన్టీఆర్ ట్రస్ట్‌కు రక్తాన్ని అందించారు. అనంతరం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తామని సన్యాసిరావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం నాయకులు స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, ముగడ రాజారావు, బుడుమూరు గోవింద్, ఏడువాక సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి నిర్భాగ్యుల తరలింపు



టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని ఏయూటీడీ వసతి గృహంలో నిరాశ్రయులు

సీతమ్మధార : నగరంలోని పలు ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పదిహేను మందిని ద్వారకానగర్‌లోని ఏయూటీడీకీ తరలించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న వారిని ఆర్‌పీఎఫ్ సిబ్బంది, ఏయూటీడీ సంయుక్తంగా టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని వసతిగృహానికి తరలించారు. వీరిలో మానసిక రోగులు, వృద్ధులు, ఇల్లు వదిలి వచ్చేసిన వారు ఎక్కువగా ఉన్నారు. వీరందరికీ వైద్యం చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ రామకృష్ణ, షెల్టర్ అధికారి భాస్కరరావు తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న భక్తి సంగీత విభావరి



కార్యక్రమంలో పాల్గొన్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్ : గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని సంపత్ వినాయగర్ దేవాలయంలో మెలోడీ క్రియేటర్స్ నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంవీ రాజశేఖర్ సారథ్యంలో సంగీత విభావరి సాగింది. కన్వీనర్ ప్రభాకర్, ఎమ్మెస్ మాధవ్, పూర్ణిమ, సత్యశ్రీ, గ్రంథి సిస్టర్స్ ఆలపించిన భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి.

'తీయని గతం' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

భీమునిపట్నం: భీమిలిలోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో ఉపాధ్యాయుడు, రచయిత పాత్తూరు రాజేంద్రప్రసాద్ వర్మ రచించిన 'తీయని గతం' పుస్తకావిష్కరణ ఆదివారం జరిగింది. ఈ పుస్తకాన్ని డైట్ విశ్రాంత అధ్యాపకుడు మంథా సుబ్బారావు ఆవిష్కరించారు, సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి బి.శ్రీనివాసరావు, విశ్రాంత డీఈవో ఎ.సాయిబాబా, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు పాల్గొన్నారు.



నత్తే నయం !

ఆధునికీకరణ పనుల్లో భాగంగా మట్టిని రోడ్డుపై వదిలేసిన దృశ్యం



అసంపూర్తిగా టీటీడీ కూడలి పనులు

- కొనసా..గుతున్న టీటీడీ కూడలి ఆధునికీకరణ పనులు
- ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలి ఆధునికీకరణ నత్తనడకన సాగుతోంది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం (ప్రాజెక్ట్స్) ఈ కూడలి ఆధునికీకరణ పనులు గతంలో చేపట్టింది. నగర వ్యాప్తంగా పలు ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్‌లో భాగంగా టీటీడీ కూడలిని సైతం ఆధునికీకరణకు శ్రీకారం చుట్టారు. అయితే గత 6 నెలలుగా ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో పనులకు అంతరాయం ఏర్పడగా..కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం ఈ పనులపై నిర్లక్ష్యం చూపుతోంది. గత నెలలో మరోసారి ఈ పనులను ప్రారంభించినప్పటికీ ప్రస్తుతం మళ్లీ పనులు కొండెక్కాయి. ఈ నేపథ్యంలో జీవీఎంసీ సత్వరమే ఈ పనుల పూర్తిచేసి కూడలిని సుందరంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

నిల్వ ఉన్న మేక తలలు కొనుగోలు చేయొద్దు

వినియోగదారులకు వెటర్నరీ అధికారుల సూచన



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ వెటర్నరీ అధికారులు

ఆరిలోవ: నిల్వ ఉన్న మేక తలలు, బోటీలను కొనుగోలు చేయవద్దని వినియోగదారులకు జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు సూచించారు. జాతీయ రహదారి పక్కన హనుమంతవాక వద్ద మేక తలలు, బోటీ విక్రయాలను ఆదివారం పరిశీలించారు. కొందరు అక్కడ ఐస్ బాక్స్‌లలో నిల్వ ఉన్న మేక తలలు, బోటీ విక్రయించడాన్ని గమనించి, స్వాధీనం చేసుకున్నారు. అక్కడే వాటిపై ఫినాయిల్ వేసి, డంపింగ్‌యార్డుకు తరలించారు. వాటిని అక్కడ గోతిలో పాతిపెడతామని తెలిపారు. ఈ సందర్భంగా వెటర్నరీ అధికారులు వినియోగదారులకు వాటిపై అవగాహన కల్పించారు. నిల్వ ఉన్న మేక తలలు తినడం వల్ల అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ఇక్కడ పాడైన మేక తలలు, బోటీ విక్రయిస్తే తమకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాడైనవి విక్రయిస్తే కఠిన చర్యలు

పాడైపోయిన మేక తలలను విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెటర్నరీ అధికారులు హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడవద్దన్నారు. ఇక్కడ వాటిని విక్రయించవద్దని, మేకల కబేళా వద్ద మాత్రమే, మంచివి విక్రయించాలని సూచించారు.

ఈవీ చార్జింగ్ స్టేషన్ ప్రారంభం




ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్

బీచ్‌రోడ్డు: ఎలక్ట్రికల్ వాహనాల వినియోగంతో పర్యావరణానికి మేలు చేకూరుతుందని ఎంపీ శ్రీభరత్ అన్నారు. ఉర్జా ఛార్జ్‌టెక్ సంస్థ, నోవాటెల్ సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ విశాఖలో ఏర్పాటు చేసిన ఉర్జా చార్జ్‌టెక్ సంస్థ ద్వారా దేశ వ్యాప్తంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా పచ్చదనం కాపాడి భవిష్యత్తు తరాలకు స్థిరమైన భవిష్యత్తు అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఐటీ బాంబే ఎనర్జీ ఇంజినీర్ సుశీల్ రెడ్డి, ఉర్జా సంస్థ సీఈవో కృష్ణ, నోవాటెల్ జీఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

పవిత్రోత్సవంలో విశేష పూజలు



కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది



పవిత్రోత్సవాల్లో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం కనకమహాలక్ష్మి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 8 నుంచి గణపతి పూజ, పుణ్యాహవాచన, సప్తకలశ ఆరాధన, అభిషేకం, ప్రధాన హోమాలు, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. సాయంత్రం 6.30 నుంచి మహాశాంతి హోమం, నీరాజన మంత్ర పుష్పం జరిపారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి విశేష పూజలతో పాటు పవిత్ర విరమణ, మహాపూర్ణాహుతి, వేద ఆశీర్వచన చేయనున్నారు. మధ్యాహ్నం పంచామృతాభిషేకం అనంతరం 12.30 గంటల వరకు గర్భాలయ దర్శనాలు, ఆర్జిత సేవలు, శాశ్వత సేవలు నిలిపివేయనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలకం

రాష్ట్ర కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్



మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాలేజీ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్

మురళీనగర్: సమాజాభివృద్ధిలో ఇంజినీర్లు కీలక పాత్ర వహిస్తారని రాష్ట్ర కాలేజీ విద్య కమిషనర్, బీసీ వెల్ఫేర్, ఈడబ్ల్యూఎస్, జీఏడీ సర్వీసెస్ కార్యదర్శి డాక్టర్ పోలా భాస్కర్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యతన ఆదివారం నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అభివృద్ధి, పరిపాలన, ప్రణాళికా రచనలో ఇంజినీర్లు ప్రధాన భూమిక పోషిస్తారన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య అంతర్జాతీయంగా పేరు పొందిన ఇంజినీరని, ఆయన వారసులుగా ఇంజినీర్లు అభివృద్ధి కార్యక్రమాల్లో తమ వంతు పాత్రను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించారు. సివిల్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్స్ సివిల్ సర్వెంట్‌గా ఉంటే ఎంత ఉపయోగమో తాను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానన్నారు. కాబోయే ఇంజినీర్లు మంచి భవిష్యత్‌ను పొందాలని ఆయన ఆకాంక్షించారు. ముందుగా కాలేజీలో ఏర్పాటు చేసిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి, ఘనంగా నివాళులర్పించారు. విగ్రహాన్ని కాలేజీ పూర్వ విద్యార్థులు ఎ.వరహాలు, ఎంఎస్‌డీ కుమార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఇతర విభాగాల హెడ్‌లు, పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేముడు, ఐఎస్‌టీఈ విశాఖ జిల్లా చాప్టర్ గౌరవ కార్యదర్శి డాక్టర్ కొండల ముఖేష్, పూర్వ విద్యార్థులు వి.రామచంద్రరావు, వి.నాగభూషణరావు, బాలకృష్ణ, సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయంలో..

సీతమ్మధార : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఆంధ్రప్రదేశ్ తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఆదివారం సంస్థ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, డి.సుమన్ కల్యాణి, టి.వి.ఎస్.ఎన్. మూర్తి, బి.అశోక్‌కుమార్, పలువురు అధికారులు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంజినీర్స్ డే సందర్భంగా విశిష్ట సేవలందించిన సీజీఎంలు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్‌లకు ఎమినెంట్ ఇంజినీర్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

హద్దు మీరితే చర్యలు తప్పవు

సీతమ్మధార: ద్వారకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక నిమజ్జనంలో ఎటువంటి అల్లర్లు చేసిన కఠినమైన చర్యలు తీసుకుంటానని ద్వారకా సీఐ డి.వెంకటరమణ హెచ్చరించారు. ఈ మేరకు ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే వేలి ముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో 18 గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకొక్క గణపతి నిమజ్జనం వద్ద ఒక కానిస్టేబుల్ పర్యవేక్షిస్తారన్నారు. మద్యం సేవించి అల్లరు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్ల తీరుపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి చాలా సీరియస్‌గా ఉన్నారని , హద్దు మీరితే జిల్లా బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీను, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

24న మాధవపెద్ది సురేష్‌కు సత్కారం

మద్దిలపాలెం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 4వ వర్ధంతిని ఈనెల 24వ తేదీన మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నామని ప్రతాప్ తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటల నుంచి బాలు గీతాలాపనతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్‌కు డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సంగీత పురస్కారంతో సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకర్ బ్రత బాగ్చీ, విశిష్ట అతిథిగా మాజీ స్పీకర్ యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు హాజరుకానున్నా రన్నారు. మిలీనియం శేఖర్ బృందంచే సినీ సంగతి విభావరి నిర్వహించనున్నా మన్నారు.

గణనాథుడి సన్నిధిలో కుంకుమార్చన

ఎంవీపీకాలనీ: గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నవ్య కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-11లో ఆదివారం కుంకుమార్చనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్వామిని దర్శించుకున్నారు. పూజలు, హోమంలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో నవ్య కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

సందడిగా స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథలు చెబుతున్న కథకులు వరలక్ష్మి

సీతంపేట: భారతీయ విద్యా భవన్స్ స్కూల్, విశాఖపట్నం పౌర గ్రంథాలయం సంయుక్తంగా ఆదివారం ఉదయం లైబ్రరీలోని మియావాకీ సెంటర్‌లో నిర్వహించిన స్టోరీ టైం విద్యార్థులను అలరించింది. ప్రముఖ కథకులు కె. వరలక్ష్మి రాజస్థానీ జానపద కథలతో చిన్నారులను మంత్రముగ్ధులను చేశారు. రాజస్థాన్ సంప్రదాయాలతో, సృజనాత్మకతతో, రాజస్థానీ తోలు బొమ్మలు, కథలు చెప్పి విద్యార్థులను ఆకట్టుకున్నారు. కథలకు సంగీత వాయిద్యాలను లయబద్ధంగా జోడించి పిల్లలు సైతం జత కలిపేలా కథలో లీనం చేశారు. నగరంలో వివిధ పాఠశాలల నుంచి సుమారు 60 మంది పిల్లలు పాల్గొని ఆసక్తిగా కథలు విన్నారు. అనంతరం పేపర్‌తో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, ఓరిగామి, వర్క్ షీట్ నింపడం, పిక్చర్ బుక్ వంటి యాక్టివిటీ చేయించారు.


చిరస్మరణీయుడు రామచంద్రమూర్తి



రామచంద్రమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

డాబాగార్డెన్స్ : రామ్‌నగర్ మెయిన్‌రోడ్డులో గల రాఘవేంద్ర స్వామి ఆలయంలో గల సమావేశ మందిరంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి నేతృత్వంలో ఇటీవలే పరమపదాన్నుపైన ఇంద్రగంటి రామచంద్రమూర్తి సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ముందుగా సమితి కార్యవర్గ సభ్యులు ఆకొండి వెంకట్రావు, కె. సుబ్రహ్మణ్యం , పి. జగన్‌మోహన్‌రావు తదితరులు రామచంద్రమూర్తి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సంస్మరణ సభలో వీవీ శంకరం మాట్లాడుతూ ఆధ్యాత్మిక రంగానికి, సంకీర్తన వైభవానికి తనదైన శైలిలో విశిష్ట సేవలందించిన ఇంద్రగంటి రామచంద్రమూర్తి సదా చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ మాట్లాడుతూ తన పరిపూర్ణమైన జీవితాన్ని భజన సాంప్రదాయం కోసం అంకితం చేసిన ఘనత రామచంద్రమూర్తికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో రామచంద్రమూర్తి కుమార్తెలు డాక్టర్ గాయత్రి, గీత, మధుబాబు, మధుసూదన రావు, నాగేశ్వరరావు, డాక్టర్ దీప్తి, శేఖర్, ఇంద్రసేన్, కృష్ణారావు, ముఖేష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓనం ముగ్గుల పోటీలు



ఓనం రంగవల్లికను తీర్చిదిద్దుతున్న కేరళ మహిళలు

మురళీనగర్: కేరళీయుల ఓనం వేడుకల్లో భాగంగా బిర్లా కూడలి సమీపంలోని కళాకేరళీయంలో కేరళ కళా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. కేరళ కళాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఉన్నిత్తన్, లైలా గణేష్‌లు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల రంగవల్లులతో ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈ నెల 22న నిర్వహించనున్న ఓనం ఉత్సవాల్లో విజేతలకు బహుమతులు అందిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు చెప్పారు.

సీతాకోక చిలుకా.. నీవెక్కడ?



జూలో వినియోగంలో లేని సీతాకోక చిలుకల పార్క్

- జూలో నిర్లక్ష్యానికి గురైన బటర్‌ఫ్లై పార్క్
- పునరుద్ధరించాలని సందర్శకుల వినతి

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్క్‌లో సీతాకోకచిలుకల పార్క్ మూలకు చేరింది. కొన్నేళ్ల నుంచి జూ అధికారులను ఈ పార్క్‌ను పట్టించుకోవడం లేదు. ఒకప్పుడు వందలకొద్దీ సీతాకోకచిలుకలు సందర్శకులను అలరించేవి. ఇప్పుడు అవి కనిపించడం లేదు. జూలో నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్ ఎదురుగా 2012లో సీతాకోకచిలుకల పార్క్ ఏర్పాటు చేశారు. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపానులో ఇది నాశనమైంది. 2015లో ఈ పార్క్‌ను పునరుద్ధరించారు. అప్పటి నుంచి సందర్శకులకు అందుబాటులో ఉన్న ఈ పార్క్ మూడేళ్ల కిందట మళ్లీ మరమ్మతులకు గురైంది. సీతాకోకచిలుకలు బయటకు ఎగిరి పోవడానికి వీలులేకుండా ఏర్పాటు చేసిన మెష్ చిరిగిపోయింది. అప్పటి నుంచి జూ అధికారులు దీనికి మరమ్మతులు మాత్రమే చేపడుతున్నారు. పూర్తి స్థాయిలో పునరుద్ధరించడం లేదు. తరచూ మరమ్మతులకు గురవుతున్న ఈ పార్క్‌పై అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ప్రస్తుతం వినియోగంలో లేదు. పైకప్పుపై మెష్ లేకపోవడంతో ఇందులో సీతాకోకచిలుకలు బయటకు వెళ్లిపోయాయి. రెండేళ్లుగా జూలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థలు అందించిన సీఎస్సార్ నిధులతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం, వన్యప్రాణులకు సంబంధించిన నైట్‌క్రాల్స్ నిర్మాణాలు చేపట్టారు. పిల్లలు, పెద్దలను అలరించే సీతాకోకచిలుకల పార్కుపై మాత్రం అధికారులు నిర్లక్ష్యం చూపతున్నారని సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఘనంగా అన్నసమారాధనలు



పెదగదిలిలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



అన్నప్రసాదం వడ్డిస్తున్న పల్లా దుర్గారావు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం పలు ఉత్సవాల నిర్వాహకులు అన్న సంతర్పణలు నిర్వహించారు. జీవీఎంసీ 12వ వార్డు పరిధి పెదగదిలిలో శ్రీకృష్ణా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసంతర్పణలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. చినగదిలి, పెదగదిలి, సాలిపేట, సింహగిరి కాలనీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఇక్కడ స్వామి ప్రసాదం స్వీకరించారు. దీంతో పాటు జీవీఎంసీ 13 వార్డు పరిధి శివాజీనగర్-2లో ముత్యమాంబ యూత్ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనలో వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.

మహా అన్నదానం

బీచ్‌రోడ్డు: వినాయక చవితి సందర్భంగా జీవీఎంసీ 28వ వార్డులోని పితానిదిబ్బలో ఆదివారం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో నక్క చిట్టిబాబు, చట్టి చిన్న తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి



ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులతో మత్స్యశాఖ జేడీ విజయ, మైలపల్లి లక్ష్మయ్య తదితరులు

మహారాణిపేట : విశాఖ తీరంలో బోటు అగ్నికి ఆహుతైన సమాచారం ప్రభుత్వానికి ఇచ్చినట్టు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.విజయ తెలిపారు. బోటు ప్రమాదంపై అన్ని వివరాలు సేకరించామన్నారు. దీనిపై విచారణ కూడా చేశామన్నారు.

రూ. 35 లక్షల ఆస్తి నష్టం

అగ్ని ప్రమాదానికి గురైన బోటు బాధితులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు అన్నారు. ఈ బోటు ప్రమాదం వల్ల రూ. 35 లక్షల ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ప్రమాద సమయంలో బోటులో ఐదుగురు మత్స్యకారులు ఉన్నారని, ఇంకో బోటు సహాయం వల్ల వారు క్షేమంగా ఒడ్డుకు చేరుకున్నారని తెలిపారు. రాష్ట్ర మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు, గౌరవ అధ్యక్షుడు పి.సి.అప్పారావు ఆదివారం సాయంత్రం బాధితులను పరామర్శించారు. బోటు ఇంజిన్‌లో మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగిందని, ఈ ఏడాది వేట ప్రారంభమయ్యాక ఇంత వరకు ఆరు బోట్లు ప్రమాదాలకు గురయ్యాయని తెలిపారు. ఈ ఘటనను విశాఖపట్నం లోక్‌సభ సభ్యుడు ఎం. శ్రీభరత్‌కు తెలియజేశామన్నారు. ఆయన వెంటనే స్పందించి ఈ విషయం ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చినట్లు మైలపల్లి లక్ష్మణరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్న మత్స్యకారులతో పాటు రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మర పడవల సంఘం మాజీ అధ్యక్షులు పి.సి. అప్పారావు, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గనగళ్ల రాజేష్, ఉపాధ్యక్షుడు మట్టా రాజు, సెక్రటరీ మున్నం బాలాజీ, జాయింట్ క్యాషియర్ బడే అనిల్, డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ బి.కె. పట్నాయక్, డాక్ ఇన్‌స్పెక్టర్ లీలాప్రసాద్, చీకటి రమేష్, గరికిన రవి, మెరైన్ సీఐ పల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'అర్ధనారీశ్వర గణపతి'గా దుర్గాగణపతి



'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో దుర్గాగణపతి

సీతంపేట: వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా సీతంపేటలో కొలువైన దుర్గా గణపతి చివరి రోజు ఆదివారం సాయంత్రం 'అర్ధనారీశ్వర గణపతి' అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. పరిసర ప్రాంత భక్తులు స్వామిని దర్శించి పూజలు చేశారు. ఉదయం ఆలయంలో గణపతి హోమం, స్వామి వారికి పంచామృత అభిషేకం, చందన, విభూది, ఫల రసాలతో విశేష అభిషేకం, సహస్ర నామార్చన, ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమం, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, ఆర్కెస్ట్రా భక్తులను అలరించింది.